గుర్తుతెలియని వృద్ధురాలు మృతి



నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ఉన్న సాయిబాబా టెంపుల్ పక్కన గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలం గ్రామంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతూ, సాయిబాబా ఆలయ సమీపంలో గ్రామస్తులు, దాబా హెూటల్‌లో భిక్షాటన చేస్తూ జీవించేది. గురువారం ఉదయం వృద్ధురాలు మరణించడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

శుక్రవారం 24 మార్చి 2023

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



నవతెలంగాణ-మద్నూర్

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. డోంగ్లి మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన రాజప్ప (45) అనే కౌలు రైతు గురువారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో వరి పంటకు మందు స్ప్రే చేస్తుండగా అతని పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూసుకోకపోవడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

నేడే సీపీఐ(ఎం)

జన చైతన్య యాత్ర

- ప్రారంభించనున్న పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్
- నిజామాబాద్ నుంచి గాంధారి ఎక్స్‌రోడ్డు వరకు బైక్ ర్యాలీ
- ధర్నాచౌక్‌లో బహిరంగ సభ
- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ నేతృత్వం
- బహిరంగ సభను విజయవంతం చేయండి : రమేష్‌బాబు



సభకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా, సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సీపీఐ(ఎం) చేపట్టిన జన చైతన్య యాత్ర నిజామాబాద్‌లో నేడు ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న మూడు జాతాల్లో భాగంగా నిజామాబాద్ చైతన్యయాత్ర జాతాను శుక్రవారం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఏ విజయరాఘవన్ ప్రారంభిస్తారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ నాయకత్వం వహించనున్నారు. యాత్రలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కూడా పాల్గొంటారు. చైతన్యయాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి ధర్నాచౌక్ వరకు భారీ బైక్ ర్యాలీని చేపట్టనున్నారు. అనంతరం ధర్నాచౌక్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. బహిరంగ సభ తరువాత ధర్నాచౌక్ నుంచి కామారెడ్డి జిల్లా గాంధారి ఎక్స్‌రోడ్డు వరకు బైక్ ర్యాలీ జరగనుంది. ఈ ర్యాలీని, బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పార్టీ జిల్లా నాయకత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జిల్లా నలుమూలల నుంచి జన సమీకరణ చేపడుతున్నారు. ఈ యాత్ర నిజామాబాద్ నుంచి కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్ జిల్లాల గుండా ప్రయాణించి 29న హైదరాబాద్ ముగింపు సభకు చేరనుంది. ఈ బైక్ ర్యాలీలో, బహిరంగ సభలో పెద్దఎత్తున జనం పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు.



చైతన్య యాత్రలో భాగంగా ఆయన గురువారం నవతెలంగాణతో మాట్లాడారు. మోడీ, అమిత్‌షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాలను మోపుతున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు విమర్శించారు. 2014లో రూ.410 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1150లకు చేరిందని వాపోయారు. పైగా ప్రభుత్వ రంగాన్ని ప్రయివేటు కంపెనీలకు దారాధత్తం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు ప్రతి ఒక్కరికీ పదిహేను లక్షలు ఇస్తానని హామీనిచ్చి... అధికారంలోకి వచ్చాక జీఎస్టీ పేరుతో అన్నింటిపై పన్నుల భారం మోపారని వాపోయారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రాంతాల్లో 8.3 శాతం, గ్రామీణ ప్రాంతంలో 30 శాతం నిరుద్యోగం పెరిగిందని అన్నారు. మతవిద్వేషాలు పెంచుతూ దేశ ప్రజల మధ్య ఆగాధం పెంచుతున్నారని, రాజ్యాంగ యంత్రాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగ లౌకిక విలువలకు తూట్లు పొడుస్తూ.. మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని వాపోయారు.

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎంపీ.. బోర్డు తీసుకురాకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రత్యేక బోర్డు లేక రైతుల పంటల్లో నూతన పద్ధతులు పాటించక ప్రతియేటా దిగుబడిలో నష్టపోతున్నారని వివరించారు. పైగా మార్కెట్‌లోనూ ధర లేక ఈ యేడాది రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని వాపోయారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ విషయంలోనూ కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఎంపీ అరవింద్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామంటూ పాదయాత్ర చేపట్టి.. ఆ తరువాత మరిచిపోయారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న నిజామాబాద్‌లో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర సర్కారు మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో

ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్/గాంధారి

భగత్ సింగ్ స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. గురువారం కామారెడ్డి కేంద్రంలో భగత్‌సింగ్ 92వ వర్ధంతిని పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశాన్ని బ్రిటీష్ వారి బానిసల నుంచి విముక్తి కలిగించే ప్రయత్నంలో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ఉరికంబానికి చిరునవ్వుతో వేలాడుతూ ప్రాణాలర్పించిన విప్లవ వీరులు భగత్ సింగ్ అని అన్నారు. భారత దేశ స్వతంత్రం కోసం 23 ఏళ్ల యువప్రాయంలోనే ఉరికంబం ఎక్కిన భగత్ సింగ్ నేటికీ ఎందరికో ఆదర్శంగా నిలుస్తాడని అన్నారు. దోపిడీ పీడన అణిచివేతలు కులమతం లేని సమసమాజ స్థాపనకై కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద బీజేపీ, ఆర్ఎస్ఎస్



నివాళులర్పిస్తున్న నాయకులు

విధానాలను ఎండగట్టాలన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో జరుగుతున్న దుర్మార్గాలను ప్రజల మధ్య పెడుతున్న మతచిచ్చు, ఈ దేశాన్ని మధ్యయుగాలనాటి పురాతన సంస్కృతికి తీసుకుపోవడానికి చేసే ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రజాధనాన్ని కొల్లగొట్టే పనిలో స్వదేశీ విదేశీ కార్పొరేట్లు మునిగితేలుతున్నారని దీనికి తోడు కార్మిక సంస్కరణ పేరుతో శ్రామిక ప్రజల హక్కులపై దాడి జరుగుతుందని ప్రజాతంత్ర హక్కులను పౌర హక్కులను కాలరాస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్‌గౌడ్, కె.రాజనర్సు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరుణ్, ఎస్ఎఫ్ఐ అల్తాఫ్, ఎండీ మహబూబ్ అలీ, మున్సిపల్ టౌన్ అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని దుర్గం గ్రామ హనుమాన్ చౌరస్తాలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పీడీయస్‌యూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మోజీరామ్, నాయకులు యాస్పల్, దేవిసింగ్, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర వైద్య బృందం

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరుపై కేంద్ర అధ్యయన బృందం గత రెండు రోజులుగా ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. ఇప్పటికే ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కాయకల్ప అవార్డు దక్కగా రెండవసారి పీహెచ్సీ పనితీరు పరిశీలించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వైద్యాధికారులు డాక్టర్ శాలిని చావ్లా, డాక్టర్ సీమా మురళి రెండు రోజులుగా ఎడపల్లి పీహెచ్‌సీలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రం నుంచి అందే ఓపీ విభాగంతో పాటు, మందుల సరఫరా, వైద్య చికిత్సలు, కుటుంబ నియంత్రణ చికిత్స, క్షయ వ్యాధి, ల్యాబ్ టెక్నీషియన్ గదితోపాటు మందులు మాత్రలు ఉన్న గదిని వైద్యులు పరిశీలించారు. హెచ్ఐవీ రోగుల పరిశీలన, గ్రామాలలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాల పనితీరుపై సమగ్ర అధ్యయనం చేశారు. ప్రస్తుతం రికార్డుల పరిశీల పూర్తయ్యాక నివేదికను కేంద్ర ప్రభుత్వ అధ్యయన బృందానికి అందజేయనున్నారు. ఒకవేళ అవార్డు దక్కితే రూ.మూడు లక్షలు ప్రోత్సాహకంగా లభిస్తాయని అధికారులు తెలిపారు. దీనితోపాటు పీహెచ్‌సీ స్థాయిని కూడా పెంచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ బృందం వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుదర్శనం బోధన్ ఏరియా ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య, ఎడపల్లి వైద్యాధికారి వినీత్‌రెడ్డి, ప్రోగ్రాం డీపీఓ విశాల రాణి, హెచ్ఈఓ రాములు, సూపర్వైజర్లు రాజేశ్వర్, భారతి, మధు, యూసుఫ్, ఆరోగ్య ఉప కేంద్రం ఏఎన్ఎంలు, స్థానిక ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు. కాగా కేంద్ర బృంద వైద్యులను ఆస్పత్రి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



పీహెచ్‌సీ వద్ద కేంద్ర వైద్య బృందం

కాంగ్రెస్ పార్టీ నాయకుల అరెస్ట్



రామారెడ్డి : నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి/గాంధారి

పేపర్ లీకేజీపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ, రేవంత్‌రెడ్డిని సీట్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎండగట్టవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. అరెస్టు అయిన వారిలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి, చింతకుంట కిషన్, నామాల రవి, గంగారెడ్డి, సాకలి సాయిలు, పోసానిపేట నవీన్ తదితరులున్నారు.

గాంధారి : మండల కేంద్రానికి చెందిన, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను గాంధారి పోలీసులు సుమారు నాలుగు గంటల ప్రాంతంలో అరెస్ట్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాదులో సీట్ సంస్థ ముందు హాజరుకానున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చర్యలో భాగంగా గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూర్పు రాజు, ఎంపీటీసీ సభ్యుడు కామెల్లి బాలరాజ్, సీనియర్ నాయకులు మదర్, లైన్ రమేష్, మోహన్ నాయక్, సంగెం రాజు, గన్ల లక్ష్మణ్, ఆకుల లక్ష్మణ్, రమేష్ పటేల్, నీళ్ల రవి,సంగానిబాబా, జస్వంత్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, మిథ్య నాయక్ ,శీను, శేఖర్, బషీర్, తదితరులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

సిండికేట్ బ్యాంకుకు తాళం వేసిన వినియోగదారులు

- వర్నిలో ఖాతాదారులకు 40 లక్షల టోకరా

నవతెలంగాణ-వర్ని

మండలంలోని సిండికేట్ బ్యాంకు మేనేజర్‌ను, సిబ్బందిని లోపల ఉంచి బ్యాంక్ ఖాతాదారులు తాళం వేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బ్యాంక్ ఖాతాదారుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాల నుంచి సిండికేట్ బ్యాంకు అనుసంధానంతో కిరాణషాపు యజమానులతో పాటు ఇతర ఖాతాదారుల నుంచి రోజువారీగా డబ్బులు వసూలు చేసి సిండికేట్ బ్యాంకులో వారి పేరున జమ చేస్తున్నట్టు నమ్మబలికిస్తూ.. డబ్బులు వసూలు చేశాడు. ఈ మధ్యకాలంలో ఆ వ్యక్తి డబ్బుల కలెక్షన్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన వినియోగదారులు గత 15 రోజుల క్రితం సిండికేట్ బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించి ఆ వ్యక్తిని పిలిచి నిలదీయగా అందుకు బ్యాంకు మేనేజర్, సిబ్బంది ఆ డబ్బులు ఇప్పించే బాధ్యత తమదని హామీనిచ్చారు. ప్రస్తుతం బ్యాంక్ అధికారులు కూడా చేతులు ఎత్తివేయడంతో వినియోగదారులు గురువారం బ్యాంకుకు వెళ్లి.. బ్యాంకు మేనేజర్‌ను, సిబ్బందిని లోపల నుంచి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. తమ డబ్బులు సుమారు 40 లక్షల వరకు టోకరా వేశాడని, అలాంటి వ్యక్తికి సపోర్ట్ చేసిన బ్యాంక్ వారే బాధ్యత వహించి తమ రుణం ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న వర్ని ఎస్ఐ అనిల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని బ్యాంక్ మేనేజర్‌తో, ఖాతాదారులతో మాట్లాడి సముదాయించడంతో ఆందోళన విరమించారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్
- ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలు పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిరుపేదలకు ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరై మాట్లాడారు. నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నిరుపేదలకు జీవితంలో ఒక తృప్తి లభించిందని చెప్పారు. ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని, ఆత్మధైర్యంతో జీవించాలని సూచించారు. జీవో ఎం.ఎస్. నెంబర్ 58 (అసైన్మెంట్-1) కింద 233 మంది కామారెడ్డి పట్టణంలోని లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 2014 జూన్ 2 తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న వారిని ఆదుకోవాలని ప్రభుత్వం ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ జీవోను అమలుపరిచిందని పేర్కొన్నారు. ఎక్కువ మంది నిరుపేదలు దరఖాస్తు చేసుకోలేదని, తాను ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో 2020 వరకు ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉన్న నిరుపేదలు ఏప్రిల్ 30లోగా ఆన్లైన్ ద్వారా ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని పట్టణంలోని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 240 మంది దరఖాస్తులు చేసుకోగా 233 మంది ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పట్టాలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇద్దరు ప్రైవేట్ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవించడం వల్ల వారికి వర్తించలేదని చెప్పారు. ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. జీవో నెంబర్ 59 ప్రకారం వారు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే మార్కెట్ ధర ప్రకారం స్థలాన్ని కొనుగోలు చేసుకునే వెసులు బాటు ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. మూడు విడతల్లో డబ్బులు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు విజయభాస్కర్ గౌడ్, అంజల్ రెడ్డి, రాజు, ప్రసన్న కుమార్, అధికారులు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

గాంధారి గ్రామపంచాయతీకి ఆరు ఉత్తమ అవార్డులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

గాంధారి : గాంధారి గ్రామపంచాయతీకి ఆరు ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు వచ్చినట్టు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ తెలిపారు. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, హెల్తీ పంచాయతీ, వాటర్ సఫీషియెంట్ పంచాయతీ, పంచాయతీ ఫర్ గుడ్ గవర్నెన్స్, సోషలిటీ సెక్యూర్డ్ పంచాయతీ, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డులు వచ్చినట్టు తెలిపారు. ఈ అవార్డులు రావడానికి సహకరించిన గ్రామపంచాయతీ పాలకవర్గం, గాంధారి గ్రామప్రజలకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధా బలరాం, డీఎల్పీఓ సురేందర్, ఎంపీడీవో సతీష్‌కుమార్, ఎంపీఓ రాజ్‌కిరణ్, గాంధారి మండల పంచాయతీ సెక్రెటరీ నాగరాజు ఫీల్డ్ అసిస్టెంట్లుతదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలుగా మూడు గ్రామాలు ఎంపిక

పిట్లం : నేషనల్ ఉత్తమ పంచాయతీలకు మూడు గ్రామ పంచాయతీలు ఎంపికైనట్టు ఎంపీడీవో వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామపంచాయతీలలో నిర్వహించిన 9 రకాల అభివృద్ధి పథకాలలో జిల్లా స్థాయిలో మండలంలోని పిట్లం, చిన్నకొడప్‌గల్, గౌరారం పంచాయతీలు, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న మూలంగా 25న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా పంచాయతీ సర్పంచులకు, సెక్రెటరీలకు అవార్డుతోపాటు, సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, సెక్రటరీ యాదగిరి పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామాల సర్పంచ్‌లకు ప్రశంసాపత్రం అందజేత

సదాశివనగర్ : మండలంలోని 24 గ్రామపంచాయతీలో 9 గ్రామ పంచాయతీలు జాతీయ పంచాయతీ అవార్డుకు ఎంపికయ్యాయి. కాగా ఆ గ్రామ సర్పంచ్‌లకు గురువారం ప్రశంసపత్రాలను ప్రజా మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపీ గైని అనసూయ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కమిటీ నర్సింలు, వైస్ చైర్మన్ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు భూమిరెడ్డి, చైర్మన్ సాయిరెడ్డి, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



గాంధారి : ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు

కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

కంటి వెలుగు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సుమలత అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంటి సమస్యతో బాధపడుతున్న వారి కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని, కంటి వెలుగు కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరమేశ్వర్ రెడ్డి, కార్యదర్శి సుమలత, ఆరోగ్య సిబ్బంది సతీష్, తదితరులు ఉన్నారు.

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం

నవతెలంగాణ-రామారెడ్డి

పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, కిశోర వాళ్లకు పోషకాహారం అందించాలని పలువురు అన్నారు. గురువారం మండలంలోని మద్దికుంట, రెడ్డిపెట్, స్కూల్ తాండ, బట్టు తాండతో పాటు కన్నపూర్ తండాలో అంగన్వాడీల ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలు, పాలు, గ్రుడ్లు, ఆకుకూరలు, సమపాలల్లో తీసుకోవాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ఉమాదేవి, సర్పంచులు చందర్ నాయక్, బొమ్మిడి రాంరెడ్డి, సునంద ప్రభాకర్ రావు, ఉప సర్పంచ్ సర్మన్ నాయక్, అంగన్వాడీ సిబ్బంది, బాలింతలు, గర్భిణీలు, కిషోర్ బాలలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు జనచైతన్యయాత్ర

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య

నవతెలంగాణ-ఆర్మూర్

లౌకిక తత్వం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. జన చైతన్య యాత్ర బస్సు హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్తున్న సందర్భంగా బుధవారం రాత్రి ఆర్మూర్ పట్టణంలో మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని, బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఎంపీ అరవింద్ మాట కూడా మాట్లాడటం లేదని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఏ ఒక్కరికి ఇచ్చిన పరిస్థితి లేదని తెలిపారు. ఆదానీ, అంబానీ పెట్టుబడిదారులకు దేశ సంపదను అప్పనంగా అప్పజెప్తున్నారని ప్రజలపై భారాలు వేయటం తప్ప మరొకటి లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయటం పేదలకు ఇచ్చే రాయితీలను ఎత్తివేయాలని చూస్తుందని కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లుగా మార్చటం పెట్టుబడిదారులకు లాభాలు తీసుకురావడానికి బీజేపీ పని చేస్తుందని అన్నారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి ప్రజల మధ్య మత కొట్లాటలు పెట్టాలని చూస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు లెల్లెల బాలకృష్ణ, జములయ్య, విజయలక్ష్మి, అడివయ్య, డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్, కమిటీ సభ్యులు బి.రవి, సిద్ధల నాగరాజు, జవహర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి టౌన్షిప్‌లో మౌలిక వసతులకు అంచనాలు రూపొందించాలి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ధరణి టౌన్షిప్‌లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అంచనాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి మండలం అడ్లూరు గ్రామ శివారులోని ధరణి టౌన్షిప్‌లో మౌలిక వసతుల కల్పనపై మున్సిపల్, విద్యుత్తు, ఆర్అండ్‌బీ, రెడ్‌కో అధికారులతో సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. విద్యుత్, తాగునీరు, మురుగు కాలువల నిర్మాణం వంటి పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, మున్సిపల్, విద్యుత్తు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

మాతుసంగెంలో కంటివెలుగు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని మాతుసంగెం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు శిబిరాన్ని మతుసంగెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కమ్మరి భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వజీర్ సంగరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వజీర్ ముకుందరావు, పంచాయతీ సెక్రెటరీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వీఆర్ఏ ఆత్మహత్య

వివరాలు మెయిన్‌లో..



- నవీపేట్ మండల కేంద్రంలో ఘటన

9వ రాష్ట్ర మహాసభ విజయవంతం చేయండి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర 9 వ మహాసభలను విజయవంతం చేయాలని గురువారం నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా అడ్డా కూలీలతో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు ఎం.మోహన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, అలాగే భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘాలకు నెలకు 3000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని, అడ్డాల మీద నీటి వసతులు, షెడ్డుని నిర్మాణం చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 6 లక్షలు ఇస్తున్నారని, దీన్ని పది లక్షల వరకు ఇవ్వాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు మురళి, సాయవ్వ, లక్ష్మి, అరుణ్, పథ్వి రాజు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో పోషణ్ అభియాన్

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని యోగేశ్వర కాలనీ లిల్లీపుట్ పాఠశాలలో గురువారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి, ఉపాధ్యాయురాలు పద్మ విద్యార్థులకు చిరుధాన్యాల పోషకాహార విలువలు తెలియజేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ దాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో బాలకవి సమ్మేళనం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో బాలకవి సమ్మేళన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొని ఉగాది పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు రాములు ఆంగ్ల నూతన సంవత్సరానికి, తెలుగు నూతన సంవత్సరానికి బేధాన్ని, పండగ సంస్కృతి, సాంప్రదాయాల గురించి తెలిపారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఉపాధ్యాయులు రవీంధర్, నాగప్ప, శంకర్, కష్ణ ప్రసాద్, విజయ, స్వప్న, సుజాత పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరుతేవాలి

- పోలీస్ కమిషనర్ నాగరాజు
- ముగిసిన మహిళా ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఈనెల 28నుండి నిర్వహించే జాతీయ స్థాయి మహిళా ఫుట్బాల్ టోర్నమెంటుకోసం తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారుల కోచింగ్ ముగింపు కార్యక్రమం నిజామాబాద్ పోలీస్ శాఖ సౌజన్యంతో నిర్వహిస్తున్న నేపథ్యంలో నిజామాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం పోలీస్‌పరేడ్ గ్రౌండ్లోని ప్రశాంతి నిలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కె.ఆర్. నాగరాజు పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాలు త్వరగా వస్తాయని, తల్లిదండ్రుల ఆశయాలను ప్రతిఒక్కరు నెరవేర్చాలని అన్నారు. జాతీయ స్థాయి క్రీడల్లో తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, అక్కడ జరిగే క్రీడల్లో అన్నిట్లో గెలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టీమ్‌కు కిట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి జి.మధుసుధన్ రావ్, నిజామాబాద్ ఎ.సి.పి కిరణ్ కుమార్, ఏఆర్ ఏసీపీ సంతోష్ కుమార్, జీపీ పాల్గుణ-తెలంగాణ రాష్ట్ర ఫుట్బాల్ అసోసియేషన్ సెక్రెటరి, డాక్టర్ కవితారెడ్డి-మహిళా ఫుట్‌బాల్ క్లబ్ ఛైర్మన్. ఎమ్.డి. షకీల్ హైమద్ - జిల్లా ఫుట్ బాల్ ప్రెసిడెంటు, రాజేందర్ రెడ్డి - రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంటు, బొబ్బిలి నర్సయ్య - జిల్లా ఓలంపిక్ అసోసియేషన్ సెక్రెటరీ, లింగన్న - కబడి అసోసియేషన్ సెక్రెటరీ, నరాల సుధాకర్ - జిల్లా ఫుట్బాల్ వైస్ ప్రెసిడెంటు, ట్రెజరర్ మీర్ ఫారుఖ్ అలీ, సెక్రెటరి జావీద్, కోచ్ నాగరాజు, భక్తపాల్ - సీనియర్ క్రీడాకారులు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ కిట్లను పంపిణీ చేస్తున్న సీసీ నాగరాజు

25న పెన్షనర్ల ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దీర్ఘకాలంగా పెండింగ్‌లో నున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ ఈనెల 25న కలెక్టర్ కార్యా లయం ఎదుట గొడుగులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం నాందేవ్ వాడలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానంగా పీఆర్‌సీ కాల పరిమితి ముగిసినందున జూన్ నుండి అమలయ్యే విధంగా కొత్త పీఆర్సి కమిటీ నియమించాలని, బకాయి ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను పటిష్ట పరిచి, నగదు రహిత వైద్యాన్ని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రిటైర్డు ఉద్యోగులందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు దత్తాత్రేయ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మదన్ మోహన్, జిల్లా నాయకులు సుదర్శన్ రాజు, ఈవిఎల్ నారాయణ, ముత్తారం నరసింహస్వామి, ఎం.జార్జ్, హనుమాన్లు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కాంగ్రెస్ నేతలను గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. హైదరాబాదులో సిట్ ముందర రేవంత్ రెడ్డి టీఎస్పీఎస్సీ లీకేజీపై చేసిన ఆరోపణలతో హాజరయ్యారు. మండలంలోని నాయకులు తరలి వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు పుట్ట గంగిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడద్దని, పేపర్ లీకేజీ ఘటన ఎంతో బాధాకరమని, ఎంతోమంది నిరుద్యోగుల ఉసురు కేసీఆర్ కుటుంబానికి తగులుతుందని అన్నారు. మోపాల్ మండల అధ్యక్షుడు గున్ని రవి, శేఖర్‌గౌడ్‌ను ముందస్తుగా అరెస్టు చేశారు.

రవీంద్ర భారతిలో ప్రతిధ్వనించిన నిజామాబాద్ కవుల స్వరాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

శోభకృత్ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ దేవాదాయ శాఖ సంయుక్తంగా రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ నాళేశ్వరం శంకరం, ఘనపురం దేవేందర్, అయినంపూడి శ్రీలక్ష్మి, కొండా రవీందర్ కవితా గానం చేశారు. ఘనపురం దేవేందర్ తేల్చుకో అనే శీర్షికతో కవితా పఠనం చేయగా, డాక్టర్ నాళేశ్వరం శంకరం సహజీవనం అనే కవితను వినిపించారు.
అయినంపూడి శ్రీలక్ష్మి మిల్ ఝులి కవితను వినిపించగా, కొండా రవీందర్ పల్లె కోకిల కవితతో ఉగాదిని స్వాగతించారు. డాక్టర్ వడ్డేపల్లి కష్ణ అధ్యక్షతన తెలంగాణ సహజీవన సామరస్య విలువలు శీర్షికన సాగిన కవి సమ్మేళనంలో కవితాగానం చేసిన నిజామాబాద్ జిల్లా కవులను శాసనమండలి సభ్యులు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గోరేటి వెంకన్న, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికష్ణ, తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరి గౌరీ శంకర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, ఆశారాజు, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, అన్నవరం దేవేందర్, మెర్సి మార్గరెట్, డాక్టర్ పత్తిపాక మోహన్, వఝల శివకుమార్, మునాస వెంకట్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఘనపురం దేవేందర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

చిరుధాన్యాలపై అవగాహన



చిరుధాన్యాల గురించి వివరిస్తున్న సూదం లక్ష్మీ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని ప్రభుత్వ ఖిల్లా ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ నిజామాబాద్ ప్రాజెక్టు వారు నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కమిషన్ మెంబర్ సూదం లక్ష్మీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిరుధాన్యాలు తినడం వలన శరీర ధృడత్వానికి, మానసిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి చిరుధాన్యాలు అలవాటుగా తినాలని సూచించారు. కార్యక్రమంలో బాలబాలికలకు పోషకాహారం, చిరుదాన్యాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి సీడీపీఓ సౌందర్య, సూపర్ వైజర్ నందిని, షేక్ ఫర్హాత్, సమీన బేగమ్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు సాయన్న పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ రెడ్డి గురువారం కలిసి మర్యాద పూర్వకంగా కలిసిన పూల బొకేను అందజేశారు. జడ్పిటిసి తనుజ భర్త శ్రీనివాస్‌రెడ్డి నిజామాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి మండల సమస్యలను వివరిస్తూ సహకరించాలని కోరారు.



కలెక్టర్‌కు బొకేను అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

విశ్వ బ్రాహ్మణ సంఘ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ- ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. విశాల్, కార్యదర్శిగా ప్రణీత్, గౌరవ సలహా దారులుగా కౌన్సిలర్ కవిత కాశీరాం, గోవర్ధన్, చిన్నారెడ్డి, చంద్రయ్య, జగన్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేశ్వర్ రెడ్డి ,కౌన్సిలర్లు రవి గౌడ్, ఆకుల రాము సహాయ సహకారాలతో గుడి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు తిరుపతి, మోహన్, సాయిరాం, సాగర్, జనార్ధన్, దినేష్, సందీప్, శివ తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డుప్రమాదంలో మరణించిన కుటుంబాలకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కె.ఆర్ నాగరాజు గురువారం చెక్కులను అందజేశారు. నీరడి గణేష్, నీరడి ఆదిత్య అంకర్ వారి ప్రకాశ్, బల్లే సాయిరామ్ మృతిచెందారన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి మానవతాధృక్పదంతో సి.జె డార్సెల్ ప్రైయివేటు లిమిటెడ్ కంపెనీ హర్యాణకు చెందిన వారు మరణించిన వారికి ఒక్కొకరికి లక్షరూపాయల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. ఈ చెక్కులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ నాగరాజు హన్మాడ్లు, రాము, సాయిలుకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ా పరిపాలన అధికారి జి.మధుసుధన్ రావ్, నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, డిచ్‌పల్లి సీఐ డి. మోహన్, ఇందల్వాయి ఎస్ఐ బి. నరేష్, రాజేష్ సింగ్ (మేనేజర్), కుటుంబీకులు హాజరయ్యారు.

కవికి పురస్కారం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తొగర్ల సురేష్ రాసిన కృతి మట్టికుండ అనే పుస్తకానికి ఇందూరు యజ్ఞ సమితి, సంస్కార భారతి ఆధ్వర్యంలో మూడ నాగభూషణం గుప్తా చేతుల మీదుగా సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం పురస్కారాన్ని అందుకున్నారు. తొగర్ల సురేష్‌తో పాటు మరికొందరు కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేద పండితులు పండిత శర్మ, మధుసూదన్ శర్మ, ఇందూరు యాజ్ఞ సమితి సంస్కార భారతి సభ్యులు త్రివేణి, మాధవి లత, చందన్ రావ్, నరేష్ రావ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జేసీ బాయ్స్ స్కూలుకు చెందిన క్రీడాకారుడు జి. చందు జాతీయస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయినట్టు ప్రిన్సిపల్ ఏ. దుర్గారెడ్డి. వైస్ ప్రిన్సిపల్ సంధ్యారాణి, శ్రీధర్ గురువారం తెలిపారు. ఈనెల 25, 26, 27, 28తేదీల్లో అస్సాం రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడా పోటీలలో పాల్గొటారని తెలిపారు. ఈ సందర్భంగా చందును నిజామాబాద్ జిల్లా అడక్ కమిటీ కన్వీనర్ పింజా సురేందర్, కోకన్వీనర్ గట్టిడి రాజేష్ అభినందించారు. క్రీడాకారుని ఎంపికపట్ల జిల్లాపేట వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు. రాజేందర్, అర్జున్, ప్రవీణ్, నరేష్. పాఠశాల, కళాశాల బృందం నాన్ టీచింగ్ స్టాఫ్ హర్షం వ్యక్తం చేశారు.



క్రీడాకారున్ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి గురువారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పెంటు గంగాధర్, వేంపల్లి, వెంచిర్యాల సర్పంచులు జక్క మల్లుబాయి గంగాధర్, మట్ట సందీప్, పార్టీ ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్, వేంపల్లి సొసైటీ డైరెక్టర్ కొమ్ముల మోహన్ రెడ్డి, టి. రాజన్న, జక్కుల శ్రీను, చిన్న బాల్ రాజ్, గద్దల రమేష్, మోహినోద్దీన్, రఫీ పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ శోభాయాత్ర

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ తండాలో బంజారుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ మాలను తాండవాసులు ధరించి భక్తిశ్రద్ధలతో సేవాలాల్ మహారాజ్ శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బంజారుల మండల అధ్యక్షులు మూడ్ గంగారాం, బుక్య ఆంజనేయులు, బుక్య సంతోష్, శ్రీధర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను అందజేశారు. మనోహర్ బాబుకు రూ. 45వేలు, బొడ్డు గణేష్ కు రూ.70వేలు, హర్షిత కు రూ.40వేలు, పోశానికి రూ.42,500 ఆర్థిక సహాయం చెక్కులు మంజూరయ్యాయి. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం స్వామి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చింత గణేష్, మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, మండల యూత్ అధ్యక్షులు కొత్తపల్లి రఘు మండల ఉపాధ్యక్షులు మల్యాల సుభాష్ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు హల్దే శ్రీనివాస్, లోలపు సుమన్, మల్కాయి రాజన్న, సుంకరి మురళి, భూమేశ్వర్, సంటి మోహన్, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సన్మానం



సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

ఎంపీపీ భీమజమున అధ్యక్షతన నేషనల్ పంచాయతీ అవార్డులో భాగంగా ఉత్తమ ప్రతిభను కనబరిచిన మండలంలోని గ్రామపంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లను సన్మానించారు. రైతు వేదికలో గురువారం ఈకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జైడి నాగాధర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఎడ్ల రాజేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో కమలాకర్, తహసీల్దార్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మౌనదీక్ష

- మోడీ దిష్టిబొమ్మదహనం

నవతెలంగాణ-కంటేశ్వర్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపైన సూరత్ కోర్టు పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష వేసిన కారణంగా బీజేపీ ప్రభుత్వ అణచివేతకు నిరసనగా కాంగ్రెస్ భవన్ వద్ద నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించారు. అనంతరం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు విక్కీ యాదవ్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకుల పరువుకు భంగం కలిగించేలా ఎన్నో మాటలు అంటుందని అన్నారు. వెంటనే బీజేపీ పార్టీ రాహుల్ గాంధీపై వేసిన కేసును బేషరతుగా వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు విక్కి యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్యుఐ ప్రధాన కార్యదర్శి విపుల్ గౌడ్,38వ డివిజన్ కార్పొరేటర్ రోహిత్, పిసిసి మాజీ మెంబర్ ఈసా,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేష్,అబుద్ బిన్ హందాన్,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మలైక బేగం,టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రీతం, నగర మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ ఏజాజ్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు సంతోష్, నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు రేవతి,జాహెద్ బిన్ హందాన్, డిసిసి డెలిగెట్ ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న నాయకులు

జాతీయ స్థాయి కరాటే పోటీలలో

శ్రీ విద్యా సాయి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

- గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ నెల 19న జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో వేపన్ విభాగంలో శ్రీనిక, శ్రీనిజ, శ్రీ వర్షిని గోల్డ్ మెడల్ సాధించారు. కటా విభాగంలో శ్రీ వర్షిని బ్రాంచ్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ సురేష్ కుమార్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ కాజాకొద్దీన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జాతీయ స్థాయి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు శ్రీనిక, శ్రీనిజ, శ్రీ వర్షినిలను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందించి, ఘనంగా సన్మానించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామంలో సర్పంచ్ గడ్డం రాధ కిష్టా రెడ్డి, రామాలయ కమిటి చైర్మన్ పొద్దుటూరి మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ అసద్ రవీందర్ వార్డు సభ్యులతో కలిసి సిసిరోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యులు సురేష్ రెడ్డి నిధుల నుండి 5 లక్షలు, ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులు 25లక్షలు. ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషి తో మంజూరు చేసిన 30లక్షల నిధులతో పనులు చేపట్టినట్టు తెలిపారు. గ్రామంలోని ముదిరాజ్ వీధి, శుభాస్ చంద్రబోస్ విగ్రహం నుండి, మైనార్టీ వీధి మజీద్ వరకు పనులను చేపడుతున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు జె.బాబు, మారు గంగాధర్, లోక్కిడి బి ఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు లొక్కడి గిరి, ఆడెపు రాజు,విడిసి సభ్యులు బక్కన, తిరుసు గంగాధర్, మారుపక నరేష్, ఉల్లెంగ రవి, తదితరులు ఉన్నారు.



రోడ్డుపనులు ప్రారంభించిన సర్పంచ్

చిన్నారులపై ప్రభుత్వానికి నిర్లక్ష్యమెందుకు?

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

చిన్నపిల్లలపై ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యం ఎందుకని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. నగరంలోని 37వ డివిజన్‌లో అంగన్వాడి కేంద్రంలో చిన్న పిల్లలకు ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుర్చీలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం చిన్నపిల్లలకు ఓట్లు లేవని అక్కసుతో కూర్చోవడానికి కుర్చీలు కూడా అంద చెయ్యని దీన స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. టీచర్లకు డబుల్ బెడ్రూంలో అందజేస్తానని చెప్పి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అంగన్వాడీ టీచర్లకు హెల్త్ బీమా అని చెప్పి చేయలేదన్నారు. ఎప్పుడు కూలుతదో అని తెలువని స్థితిలో భవనం ఉందన్నారు. నగరంలో అంగన్వాడీల్లో కుర్చీలు ఇవ్వడానికి తమ ట్రస్ట్ ముందుంటుందని తెలిపారు. టీచర్లకు రెండు మూడు నెలల నుంచి జీతాలు కూడా అందడం లేదన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కూడా కరువయ్యాయని తెలిపారు.



కుర్చీలు అందజేసిన ధన్‌పాల్ సూర్యనారాయణ

కార్యక్రమంలో బీజేపీ నాయకులు కరిపే గుండాజీ, శ్రీనివాస్, మాస్టర్ శంకర్, గడ్డం రాజు, వినోద్ రెడ్డి, బూర్గుల వినోద్, భాస్కర్ రెడ్డి, పంచారెడ్డి శ్రీధర్, బట్టి కార్ ఆనంద్, హరీష్ రెడ్డి, శివనూరి భాస్కర్, డివిజన్ నాయకులు శ్రావణ్, రవి, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో అటెండర్లను నియమించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ పాఠశాలలో అటెండర్లు లేక విద్యార్థులే పాఠశాలను శుభ్రం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలలో అటెండర్లను నియమించాలని ఏబీవీపీ నాయకులు గంధం సంజయ్ డిమాండ్ చేశారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా విద్యావ్యవస్థను చిన్నచూపు చూస్తుందని, ప్రభుత్వ పాఠశాలలో అటెండర్లు లేక మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు అధ్వానంగా తయారవుతున్నాయని వెంటనే అటెండర్లను నియమించి పాఠశాలలను శుభ్రం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సమీర్ ఖాన్, నగర కార్యదర్శి రాజేందర్, సోషల్ మీడియా ఇంచార్జ్ మేకల ఆదర్శ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీయం విఠల్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీయం విఠల్ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా ఎస్టీ గురుకుల డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్, సుక్ దేవ్, రాజ్‌గురుకు భారతీయ విద్యార్థి మోర్చా, యువ మోర్చా ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భారతీయ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పేరుమల బుల్లెట్, భారతీయ విద్యార్థి మోర్చా ఉపాధ్యక్షులు శ్రీరామ్, రవితేజ విద్యార్థులు శ్రావణ్, నరేష్, శ్రీనివాస్, శంకర్ ,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ గార్డులు పంపిణీ



గార్డులు పంపిణీ చేస్తున్న అశోక్ రాజ్

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ఊర చెరువులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు గురువారం ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లకు గార్డులను ఉచితంగా పంపిణీ చేసినట్టు బీజేపీ ఉపాధ్యక్షుడు అశోక్ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లే సమయంలో వారి మొబైల్స్ ఫోన్లు అనుకోకుండా నీటిలో పడి పాడైపోతుంటాయని అలా పాడవకుండా ఉండడానికి చేపల వేటకు వెళ్లిన వారి సెల్‌ఫోన్ గార్డులను ఉచితంగా అందజేసినట్టు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న మత్స్యకారులందరికీ సెల్ ఫోన్ గార్డులను అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

జాతీయ ఉత్తమ పంచాయతీల పురస్కారాల్లో భాగంగా బీర్కూర్ మండలంలోని ఉత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామ పంచాయతీలకు మండల స్థాయిలో సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేసినట్టు ఎంపీడీఓ భానుప్రకాష్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు రఘు, జడ్పీటీసీ సభ్యురాలు స్వరూప అధ్యక్షతన ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన గ్రామ పంచాయతీలు దామరంచ, వీరపూర్, తిమ్మాపూర్, రైతునగర్, బీర్కూర్ తండా, అన్నారం, బీర్కూర్, భైరపూర్, బరంగెడ్గి, కిష్టాపూర్, మల్లాపూర్, గ్రామాల సర్పంచ్, గ్రామ కార్యదర్శులకు ఎంపికైన వారికి సన్మానంతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత సర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాను ప్రకాష్, ఎంపీఓ అనిత, మండల పరిధి సర్పంచులు, గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యంకోసం ఎల్‌ఓసీ మంజూరు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెగాడపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పోశెట్టి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండడంతో ఆర్థిక సహాయం కోసం బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఆదుకోవాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే షకీల్ అతనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ అవార్డుల సమావేశం

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న జాతీయ పంచాయతీ అవార్డులను ఇవ్వనున్నట్టు మండల పంచాయతీ అధికారి గౌస్ ఉద్దీన్ తెలిపారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతల్ పురస్కార్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. 24న ఉదయం 11:30కు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

పెగాడపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెగాడపల్లి గ్రామంలో సర్పంచ్ శంకర్ సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో హాజరైన బోధన్ ఎంపీపీ బుద్ధి సావిత్రి మాట్లాడుతూ.. బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఉపాధి హామీ నిధుల నుంచి సీసీ రోడ్డు పనులు నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని, దాంతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌కు ఆమె గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్‌లు గంగారెడ్డి, శరత్, సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్, గ్రామపెద్దలు రామయ్య, రవి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఉప సర్పంచ్ వనజ, దండు పీరయ్య, గణేష్ పటేల్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఎల్లారెడ్డి మహిళ



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన అడ్వకేట్ పద్మ పండరి కుమార్తె పద్మ సాయి శ్రీ జూనియర్ సివిల్ జడ్జ్‌గా ఎంపికైనట్లు పద్మ పండరీ తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని జూనియర్ సివిల్ జడ్జిగా సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

అర్హులైన నిరుపేదలకు 'డబుల్' నిర్మించి ఇవ్వాలి

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూములు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బహుజన లెఫ్ట్ పార్టీ జుక్కల్ నియోజకవర్గం ఇంచార్జ్ కద్రేవార్ నాగేష్ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూంలో నిర్మాణాలు అర్హులైన నిరుపేదలకు ఇప్పటివరకు ఏ ఒక్కరికి కూడా నిర్మించకపోవడంతో ఇండ్ల కోసం ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. వీటితోపాటు పోడు భూముల లబ్దిదారులకు వెంటనే పట్టాలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగించడం పట్ల ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయని, మద్యం అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నిరుపేద మహిళలు, బహుజన లెఫ్ట్ పార్టీ నాయకులు సాయన్న, శాంతాబాయి, హనుమంత్, సంజు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పోషణ పక్వాడలో భాగంగా అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం



బోధన్ : మాట్లాడుతున్న జడ్పీటీసీ

బోధన్ : ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలతో తయారు చేసిన భోజనం చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉండ గలుగుతారని బోధన్ జడ్పీటీసీ లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలతో చేసిన వంటకాలను తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యలలో పుష్కలంగా పోషక విలువలు ఉండడం వలన తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం చిరుధాన్యాలతో చేసిన ఆహారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు పద్మ అన్నపూర్ణ సాయమ్మ, మహిళలు పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ బోధన్ అర్బన్ సూపర్వైజర్ రాధిక బోధన్ పట్టణంలో గల అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల ఆహార పదార్థాలు తీసుకోవడం పట్ల కలిగే ప్రయోజనాలపై ఆమె బాలింతలకు, మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని ఖాళీ స్థలంలో పెరటి తోటలను పెంచాలని, స్వచ్ఛమైన కూరగాయలతో పిల్లలకు భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సంధ్య, అంగన్వాడీ కార్యకర్తలు శ్యామల కళావతి, పుష్పలత, రజిత, సవిత, లక్ష్మి పాల్గొన్నారు.

రెంజల్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కందకుర్తి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ గంగాజమున ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం పోషణ్ పక్వాడాపై దంపతులతో సజ్జ రొట్టెలను తయారు చేయించారు. గెలుపొందిన వారికి త్వరలోనే బహుమతులును అందజేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. దీంతోపాటు ట్రీ గార్డెన్ ఏర్పాటు చేసి ఆకుకూరలు కాయగూరలను పండించడానికి చదును చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారలోప రహిత మండలంగా తీర్చిదిద్దుదాం

మద్నూర్ : పోషకాహారలోప రహిత మండలంగా తీర్చిదిద్దుదామని మద్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునంద అన్నారు. గురువారం మద్నూర్ గ్రామపంచాయతీ ఆవరణలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందించే పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు తదితరులు కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సునంద మొదట అవగాహనా సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కవిత, సర్పంచ్ సురేష్, డ్వాక్రా గ్రూప్ అధ్యక్షురాలు సవిత, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద : మండలంలోని మానేపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంపై సర్పంచ్ దాసరి రాములు అవగాహన కల్పించారు. వివిధ రకాల పోషకాలు అందించే కూరగాయలు, పండ్లు ఇతర ఆహార పదార్థాలను రోజు వారి ఆహారంలో తీసుకోవాలని ఆహార పదార్థాల్లో పోషకాలు, వాటి వలన కలిగే ఆరోగ్యకరమైన లాభాలను వివరించారు. పౌష్టిక ఆహార లోపంతో వచ్చే ఆరోగ్య సమస్యలు రాకుండా అంగన్వాడీ సెంటర్ల ద్వారా అందించే పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మనోజ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్త ప్రమీల, వార్డు మెంబర్లు, గర్భిణీలు, తల్లులు, చిన్నారులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆడపిల్లకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆడపిల్లకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి మరే రాష్ట్రంలో జరగడం లేదని అన్నారు. పుట్ట బోయే బిడ్డ నుంచి వృద్ధుల వరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్, సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

జల్దిపల్లిలో దేవాలయ ప్రతిష్ట మహోత్సవం ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని జల్దిపల్లి గ్రామంలో పెద్దమ్మ దేవాలయ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం ప్రారంభమైందని ముదిరాజ్ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ముదిరాజుల ఆరాధ్యమైన పెద్దమ్మ ఆలయం జల్దిపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు సొంత డబ్బులతో నిర్మాణం చేపట్టుకున్నారు. మొదటి రోజు గణపతి హోమము కార్యక్రమంలో ముదిరాజులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి, నీలా, బోర్గం, బాగేపల్లి, గ్రామాల్లో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. తాడు బిలోలి గ్రామంలో శ్రీనివాస్, నాగం సుగుణబాయి, పర్వీనా బేగం, వాజిద్ అలీ, లకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నరసయ్య గ్రామ కమిటీ అధ్యక్షులు మధు, మల్ల సాయిలు, అన్వర్ తదితరులు పాల్గొన్నారు. నీలా గ్రామంలో టిఆర్ఎస్ నాయకులు రాఘవేందర్, మండల ఉపాధ్యక్షులు యోగేష్, గఫార్ బేగ్, రాఘవాచారి, పాశం భాస్కర్ తదితరులు ఉన్నారు. బోర్గం గ్రామంలో సర్పంచ్ పార్థవాని సాయిరెడ్డి, ఉప సర్పంచ్ ఫిరోజ్దీన్, డైరెక్టర్ కదిర్ పాషా, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, పాలకవర్గ సభ్యులు నరేందర్, భాజన్న కాశీముద్దీన్, తదితరులు పాల్గొన్నారు. బాగేపల్లి గ్రామంలో సర్పంచ్ పాముల సాయిలు, ఎంపీఓ గౌస్ ఉద్దీన్, కార్యదర్శి శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

- ఎంపీపీ లావణ్య

నవతెలంగాణ-వర్ని



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

బాల్య వివాహాలు చేయొద్దని ఎంపీపీ లావణ్య అన్నారు. గురువారం చందూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావణ్య రామ్‌రెడ్డి అధ్యక్షతన బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ బాల్య వివాహాలపైన చర్చించారు. అనంతరం బోధన్ ఐసీడీఎస్ సీడీపీవో జానకి మాట్లాడుతూ.. ప్రతి బాలిక చదువుకొని మంచి ఉన్నతస్థాయిలో ఉండేలా తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి, జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, సూపర్వైజర్ మమత, డీసీపీయూ చాణిక్య, ఐసీపీఎస్ సిబ్బంది, చైల్డ్‌లైన్ సిబ్బంది, జడ్పీహెచ్ఎస్ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి



బోధన్ : వర్ధంతిలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బోధన్/వర్ని

బ్రిటీష్ వారి పాలన నుంచి భారత దేశ విముక్తి కోసం బ్రిటిష్ వారితో పోరాడిన స్వాతంత్ర సమరయోధులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురుదేవ్, సుఖ్ దేవ్‌లని బోధన్ ఏరియా కమిటీ కార్యదర్శి ఏశాల గంగాధర్ అన్నారు. వారి వర్ధంతిని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో వారికి వ్యతిరేకంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి బ్రిటీష్ వారితో పోరాటం చేసిన మహా యోధులన్నారు. ఆనాడు బ్రిటీష్ పార్లమెంట్‌పైన బాంబులు వేసిన ధీరులని అన్నారు.

దాంతో బ్రిటిష్ ప్రభుత్వం భగత్ సింగ్, రాజ్ గురు దేవ్, సుఖ్ దేవ్ ముగ్గురికి ఉరిశిక్ష వేసిందన్నారు. ఆ మహనీయుల స్ఫూర్తితో నేడు ఉన్న మతోన్మాద పెట్టుబడిదారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారత ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, ఉద్యోగులు, కులాలు, మతాలు ప్రాంతాలకు అతీతంగా పోరాటం చేసి వారి పరిపాలనను పారదోలాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు దండు సుంకరి లక్ష్మి, దండు స్వరూప, దండు సావిత్రి, అనిత, నాగం సరస్వతి, నవీన్, శివాని, సాత్విక, బాలు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : భగత్‌సింగ్ బతికిఉంటే దేశం మరోలా ఉండేదని భారతదేశానికి భగత్‌సింగ్ వేగుచుక్క లాంటివాడని సీపీఐ(ఎం) వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ 92వ వర్ధంతి నిర్వహించారు.

కంటి వెలుగు ముగింపు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి, పేపర్‌మిల్లు గ్రామాలలో గత పది రోజుల నుంచి చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం నేటితో ముగియడంతో డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ కంటి నిపుణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కంటి వైద్య నిపుణులు రాము, ప్రవీణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ కావ్య ఆరోగ్య విస్తీర్ణ అధికారి శ్రావణ్ కుమార్, సూపర్వైజర్ మౌలాంబి, ఆరోగ్య కార్యకర్తలు జానకి, రాణి, ఇమ్రాన్, లక్ష్మీనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీ అఖిల, డాటా ఎంట్రీ ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోస్పల్లి గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో 145 మీటర్ల సీసీ రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ దెవకత్తే సునీతా తుకారాం పటేల్ గురువారం ప్రారంభించినట్టు జేపీఎస్ జాదవ్ మనోహర్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, జేపిఎస్ మనోహర్, నాయకులు కేశవ్ పటేల్, దశరథ్, మలుగొండ, బాలాజీ, ఆశోక్, రామ్‌పట్నే తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం



పొగాకు కొనుగోళ్లను ప్రారంభిస్తున్న యాజమాన్యం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం, కందకుర్తి గ్రామాలలో వజీర్ సుల్తాన్ టొబాకో కంపెనీ యాజమాన్యం భాస్కర్, కృష్ణారావులో పొగాకు కొనుగోళ్లను గురువారం ప్రారంభించారు. గత సంవత్సరం నాణ్యత కలిగిన పొగాకు క్వింటాకు రూ.9600 ధర ఉండగా.. ఈ ఏడాది మరో రూ.900 పెంచి, రూ.10,500 మద్దతు ధరను ప్రకటించారు. గత సంవత్సరం కంటే 20 రోజులు ముందుగానే కొనుగోళ్లను ప్రారంభించామని వారు పేర్కొన్నారు. రైతులు నాణ్యమైన పొగాకును తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిలు, అఫ్జల్, రైతులు పోతన్న, మొయినుద్దీన్, కొజ్జా రమేష్, చీరడి రవి, అక్తర్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నేడు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశనికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశంలో జాతీయ పంచాయతీ అవార్డులను పురస్కరించుకొని సర్పంచులను, పంచాయతీ కార్యదర్శులను సన్మానించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారాని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ చుట్టుపక్కల దుకాణాలకు తైబజార్ రద్దు చేయండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గల పాత బస్టాండు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం పరిసరాల చుట్టుపక్కల వ్యాపార సముదాయాలకు తైబజార్ వసూళ్లను రద్దు చేయాలని ఆలయ అభివృద్ధికి వ్యాపార సంస్థల నుంచి ఆదాయం వచ్చే విధంగా సహకరించాలని కోరుతూ గురువారం ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు హనుమాన్లు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సందీప్‌కు, సర్పంచ్ సురేష్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 24న గ్రామపంచాయతీ ఆవరణంలో తైబజార్ వేలంపాట వెయ్యడానికి గ్రామంలో దండోరా వేయించారని తైబజార్ వేలం జరగక మునిపే పంచాయతీ పాలకవర్గానికి పంచాయతీ అధికారులకు విన్నవించినట్టు తెలిపారు.

సాటాపూర్‌లో పోషణ పక్వాడ బహుమతులు అందజేత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలోని 3 అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి తెలిపారు. అందులో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పోషక ఆహారాన్ని తయారుచేసిన దంపతులకు స్థానిక సర్పంచ్ వికార్ పాషా, కార్యదర్శి మైబుబ్ అలీ, కే.సాయిలు, బహుమతులను అందజేశారు.

నేడు జిల్లా ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాలి : యూఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు, ఇతం పెండింగ్ బిల్లుల మంజూరు కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుయస్పీసీ) ఆధ్వర్యంలో ఈనెల 24 సాయంత్రం 4గంటలకు జిల్లా ట్రెజరీ కార్యాలయాల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. అప్పటికీ ఫలితం లేకుంటే మార్చి 28 న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సత్యానంద్, రమేష్, సురేష్, సత్యనారాయణ, బాలయ్య, రాజన్న, సుధామ్, బోజన్న, వెంకట రమణ, సురేష్ రెడ్డి, గోపి రెడ్డి, శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి

- కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు నూతులశ్రీనివాస్ రెడ్డి నాయకత్వంలో కిసాన్ మోర్చా నాయకులు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అకాల వర్షాలకు నిజామాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాలలో వడగండ్ల వానతో మొక్కజొన్న, వరి, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు, నువ్వు, కూరగాయ పంటలు, ఇతర పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సంజీవ్, సుదర్శన్ రెడ్డి హరీష్ రెడ్డి కార్పొరేటర్ శ్రీధర్, లక్ష్మణ్ విట్టల్, రాజు, కిసాన్ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో

విద్యారంగ, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

- పలుపార్టీల ఆధ్వర్యంలో నివాళ్లు

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతిని పలుపార్టీల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా భగత్‌సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్: రాజ్‌గురు, సుఖ్‌దేవ్, భగత్‌సింగ్ జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, పీఎన్ఎం నాయకులు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయంలో రాజ్ గురు, సుఖ్ దేవ్, భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ కుల, మత రహిత సమాజ కోసం కృషి చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల్ని, విద్యారంగాన్ని కాషాయీకరణ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలకు ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ. అనిల్, అధ్యక్షులు రాచకొండ విఘ్నేష్ పీఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, నాయకులు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ : దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, అసమానతలు పోవాలని పోరాడి అమరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల స్ఫూర్తితో నేడు విద్యా, కార్మిక వ్యతిరేక విధానాల కోసం పోరాడాలని పీడీఎస్‌యూ, పివైఎల్, ఇఫ్టు నాయకులు జన్నారపు రాజేశ్వర్, వనమల సత్యం, యం.శివ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను మొత్తం కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని, విద్యారంగాన్ని మొత్తం కాషాయీకరణ చేస్తున్నారని, కార్మిక వ్యతిరేక పాలసీలను అవలంభిసున్నారని అన్నారు. విద్య ఉపాధి అవకాశాల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఇఫ్టు జిల్లా నాయకులు జెల్లా మురళి, ఎల్బి రవి, మోహన్, పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, దేవిక, నిఖిల్, కాపిల్, ఇఫ్టు నాయకులు రాజు, మల్లన్న, పీవైఎల్ నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ నాయకులు



కంఠేశ్వర్ :నివాళ్లు అర్పిస్తున్న సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, పీఎన్ఎం నాయకులు

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ లాంటి అమరవీరుల స్ఫూర్తితోనే నేటికి యువత ఉద్యమ బాటపడుతున్నారని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే.భూమయ్య, జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. నగరంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ వారిని వెళ్లగొట్టడంకోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ నేతృత్వంలో యువత ఉద్యమబాట పట్టారని అన్నారు. యువత, కార్మికవర్గం, రైతాంగం చైతన్యవంతులై ఉద్యమాలు నిర్వహించారని, వారి స్ఫూర్తితోనే దేశానికి స్వాతంత్రం వచ్చిందని అన్నారు. నేటి పాలకులు సామ్రాజ్యవాదుల కొమ్ముకాస్తూ దేశాన్ని దోచుకొమ్మని ఆహ్వానిస్తున్నారని, యువత, కార్మికులు, రైతాంగం సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగడాల ప్రదర్శనసైతం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా నాయకులు వై. ఓమయ్య కే.రాజన్న, వెంకటేశం, బొంబాయి గంగారం, రఘురాం, రంజిత్, రాధా కుమార్, సుమేద్ పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని కోటగల్లీ, దేవిరోడ్ చౌరస్తాలోగల భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా పేద ప్రజలకు విద్య, వైద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం ఫాసిస్టు, మతోన్మాద విధానాలను అవలంబిస్తుందన్నారు. ప్రశ్నించిన వారిని అక్రమ కేసులతో అరెస్టులు చేయడం, అంతమొందించడం లాంటి కుట్రలు పన్నుతుందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలన్న మాటలు నీటిమట్టలయ్యాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కుల, మత, విద్యా, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని, అదే నిజమైన నివాళు లు అని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, జిల్లా నాయకులు కిరణ్, పీడీఎస్‌యూ నగర ప్రధాన కార్యదర్శి డి.నవీన్ వివిధ ప్రజాసంఘాల నాయకులు లింగం, మహిపాల్, సందీప్, నర్సక్క, పావని, సంతోష్, గంగమణి, సాయితేజ, సంపత్, అజయ్, సంపత్, చందు తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో..

మోపాల్: మండల కేంద్రంలో ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) అఖిలభారత రైతుల సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవుల వర్ధంతి సభ నిర్వహించారు. అఖిల భారత రైతు కూలి సంఘం డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్నయ్య గారు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు భారత సంపదను దోచుకున్నట్లు నేడు భారతీయ జనతా పార్టీ కూడా కార్పొరేట్ కంపెనీలకు దాసోహమై యావత్ దేశ సంపదను దోచిపెడుతుందన్నారు.

పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు బండమీద నర్సయ్య అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు అగ్గు చిన్నయ్య, సర్పంచ్ క్యాతం రవి, ఎంపిటిసి ముత్తన్న, ఉపసర్పంచ్ రవికుమార్, పెద్దకాపు జనార్దన్, పంచాయతీ పాలకవర్గం, నాయకులు, యువకులు పాల్గొన్నారు

సిరికొండ: గడ్కోల్, కొండాపూర్ గ్రామాల్లో ప్రజాపంథా మండల కార్యదర్శి ఆర్. రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి పి రామకష్ణ మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్‌ల ఆలోచన విధానంతో మత విద్వేషాలకు, ఉన్మాద దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకోసం వారి స్ఫూర్తితో విద్యార్థులు, యువకులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవా గౌడ్, ఎంపీటీసీ గంగారాం, ఉప సర్పంచ్ రవి, వీడిసి చైర్మన్ సంద్ర శంకర్, సిపిఐ ఎంఎల్ ప్రజా పందా నాయకులు మల్కి లింబయ్య,ఎం నారా గౌడ్, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు అనీష్, కిరణ్, సురేష్, బి.కిషోర్,కట్ట రాములు, నిమ్మల రాములు, ఎస్ కిషోర్, మనోజ్, ఎస్ రాజేశ్వర్, యువకులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: సిపిఎం, న్యూ డెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో అర్సపల్లిలోని భగత్ సింగ్ కాలనీలో గల భగత్ సింగ్ విగ్రహానికి న్యూ డెమోక్రసీ సీనియర్ నాయకులు నాయక్ వాడి నర్సయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్యాల గోవర్ధన్ పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి మతోన్మాద ఫాసిస్టు రాజకీయాలకు పాల్పడుతుందని అన్నారు. దేశ సంపదను మొత్తం ప్రజల సంపదను మొత్తం స్వదేశీ పాలన పేరుతో ఆదాని, అంబానీ, కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో మరో ప్రజా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం భగత్ సింగ్‌పై రాసిన పాట పాడి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దేవునూరి రాజయ్య, నవీన్, అబ్బయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు గోపాల్, సాయిలు, రమేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన అమరులు సుఖ్ దేవ్, రాజ్ గురు, భగత్ సింగ్‌ను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం పునరంకితం కావాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బుస్సాపూర్ శంకర్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని సాయి రెడ్డి పెట్రోల్ బంక్ వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు అంకార్ గణేష్ , పార్టీ నగర అధ్యక్షులు కస్తూరి ప్రవీణ్ , నగర పార్టీ ప్రధాన కార్యదర్శి కుంచెపు ఆనంద్ , నగర బీసీ విభాగం అధ్యక్షులు కారం పూరి రవి కుమార్ , నగర యువజన విభాగం అధ్యక్షులు సంతోష్, సాగర్ , సాయి రాం,మహిళ నాయకులు రేఖ, రాణి పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : వలస పాలకుల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడుతూ భారతీయ సమాజానికి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదం ఇచ్చిన భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ నేటి తరానికి స్ఫూర్తి కావాలని ప్రజాపంథా కమ్మర్ పల్లి సబ్ డివిజన్ అధ్యక్షులు సారా సురేష్ అన్నారు. మండల కేంద్రంలో భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బి. అశోక్, వి. బాలయ్య, యం. సతెక్క, సారా రమేష్, వి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవ్ స్ఫూర్తితో మోడీ ప్రభుత్వం పాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఐఎఫ్ టియు జిల్లా నాయకులు ఎం.డి ఖాజా మోహినూద్దీన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్ద ఆశన్న, అల్తాఫ్, చిన్న భూమన్న లక్ష్మి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: భగత్ సింగ్ ఆశయాలను సాధించేందుకు యువత ముందుకు రావాలని సిపిఎం మండల కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు. మండలకేంద్రంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు దేవేందర్ సింగ్, మహబూబ్, కిషన్, రాజశేఖర్, సురేష్ పాల్గొన్నారు.



నవీపేటలో..



మోపాల్: భగత్‌సింగ్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు



నిజామాబాద్‌సిటీ : భగత్‌సింగ్ విగ్రహానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

రెండు పడక గదులకు దరఖాస్తు చేసుకోవాలి

- తహసీల్దార్ సురేష్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కమ్మర్‌పల్లి గ్రామానికి సంబంధించి రెండు పడక గదుల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహసిల్దార్ సురేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం, శనివారం, సోమవారం రోజుల్లో కమ్మర్ పల్లి గ్రామానికి సంబంధించి రెండు పడక గదులకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. పంచాయతీలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఇల్లు, ప్లాట్లులేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం మీ సేవ కేంద్రాల్లో లభిస్తాయని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. రెండు పడక గదులకు సంబంధించి దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు పత్రంతోపాటు కొత్త రేషన్ కార్డు జిరాక్స్, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్సులు, దరఖాస్తుదారు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, పాత రేషన్ కార్డు, కులము సర్టిఫికెట్ జత చేయాలని సూచించారు.

కులసంఘాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి, నాగంపేట్ గ్రామాలకు చెందిన ఆయా కుల సంఘాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన (సీడీపీ) నిధుల ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు గురువారం అందజేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి తోటి పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. వేంపల్లి గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘంకు రూ.3.50 లక్షలు, నాగంపేట్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘంకు మరో రూ.3.50 లక్షల రూపాయల నిధులు విడుదల చేశారు. అనంతరం లబ్దిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు పేంటు గంగాధర్, వేంపల్లి, వెంచిర్యాల సర్పంచులు జక్క మల్లుబాయి గంగాధర్, మట్ట సందీప్, పార్టీ ప్రధాన కార్యదర్శి జోషి ఉమ శంకర్, వేంపల్లి సొసైటీ డైరెక్టర్ కొమ్ముల మోహన్ రెడ్డి, టి. రాజన్న, జక్కుల శ్రీను, చిన్న బాల్ రాజ్, గద్దల రమేష్, మోహినోద్దీన్, రఫీ తదితరులు పాల్గొన్నారు..

రేపు పంచాయతీ అవార్డ్స్ ప్రదానోత్సవం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

జాతీయ పంచాయతీ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి శుక్రవారం నిజామాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఉంటుందని ఎంపీడీవో మల్లేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనూష బానోత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఉపసర్పంచ్లు ఎంపీటీసీ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు నడ్పల్లిలో తైబజార్ వేలం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండల కేంద్రంలోని నడ్పల్లి గ్రామ పంచాయతి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు తైబజార్ బహిరంగ వేళవం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ కులచారి సతిష్ రావు, గ్రేడ్ వన్ కార్యదర్శి, ఇంచార్జీ ఎంపిఒ నిట్టు కిషన్ రావు గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వ నిభందనలను పాటించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 50వేల రూపాయలు ముందుగా గ్రామ పంచాయతీలో డిపాజిట్ చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. డిపాజిట్ చెల్లించిన వారికి మాత్రమే వేలంలో పాల్గొనడానికి అనుమతించ బడుతుందని, పేర్కొన్నారు. గతేడాది కౌలు బకాయిలు ఉంటే పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉన్నా వేలం పాటలో పాల్గొనొద్దని తెలిపారు. లక్ష రూపాయల ఆస్తి, ధృవ పత్రం సంభందిత పంచాయతీల నుండి, పంచాయతి కార్యదర్శుల సంతకంతో జారీ చేయబడి ఉండాలని పేర్కొన్నారు. యజమాని సంతకం దృవపరచి ఉంటేనే అంగీకరించ బడుతుందని వివరించారు. చివరి పాట పాడి వేలం దక్కించుకున్నవారు చెల్లించిన డిపాజిట్, ధరావతు కలుపుకొని నాలుగో వంతు చెల్లించాలని తెలిపారు. వేలంలో కనీస ధర రాని పక్షంలో రద్దు పరచే అధికారు గ్రామ పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ ఆమోదించబడిన రేట్లను మాత్రమే వసూళ్ళు చేయవల్సి ఉంటుందని, అంతకు మించి వసూలు చేస్తే వేలంరద్దు చేస్తామని తెలిపారు. వేలం పాడుకున్నవారు ఏదైన కారణాలతో నెలసరి వాయిదాలు చెల్లించకపోతే వేలం హక్కులు రద్దు చేసి తిరిగి వేలం వేసే అధికారం పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. రెండవ వేలం ద్వారా వచ్చిన నష్టాన్ని మొదటి వేలం పొందిన వ్యక్తి నుండి సూలు చేయబడుతుందని వివరించారు.

జన్నేపల్లిలో ఉపాధి కూలీ మృతి

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని జన్నేపల్లి గ్రామానికి చెందిన గర్కన్ గంగాధర్(43) ఉపాధి హామీ కూలీ పని చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా పడిపోయి మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. మృతుడు తన భార్య ఇందిరతో కలిసి గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా మృతుడు అకస్మాత్తుగా పడిపోయాడు. భార్య ఇందిర వెంటనే గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. వైద్యుడు గంగాధర్ మృతి చెందినట్లు తెలిపారు. తన భర్త గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని ఇందిర ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి శవ పంచనామా నిర్వహించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని ఎల్కే ఫారంలో ఫ్లెక్సీ లొల్లి ఇద్దరిపై అట్రాసిటీ కేసుతోపాటు సర్పంచ్ భర్తపై బూతులు తిట్టాడని కేసు నమోదు అయినట్లు ఎస్సై రాజారెడ్డి గురువారం తెలిపారు. రామ మందిరం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విషయమై సర్పంచ్ భర్త స్థానిక వ్యాపారి గౌతమ్ తండ్రి రామకృష్ణలతో గొడవ జరగగా దొంత ప్రవీణ్ కులం పేరుతో దూషించాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గౌతమ్, ఆయన తండ్రి రామకృష్ణపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గౌతమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దొంత ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు.

ఉత్తమ గ్రామపంచాయతీగా హసకొత్తూర్



సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపిపీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామ పంచాయతీ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు సాధించింది. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ పంచాయతీ అవార్డుల్లో భాగంగా కమ్మర్‌పల్లి మండలంలో 9 థీమ్స్‌లకు గాను హసకొత్తూర్ గ్రామ పంచాయతీకి ఆరు థీమ్స్‌లలో జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులు లభించాయి. ఇందుకుగాను సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్‌ను ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి శాలువాతో సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డులు సాధించడంలో సహకరించిన పంచాయతీ కార్యదర్శి, గ్రామ స్థాయి అన్ని శాఖల అధికారులకు, పాలకవర్గ సభ్యులకు, గ్రామ పంచాయతీ సిబ్బందికి, గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఇదేవిధంగా గ్రామ అభివద్ధికి ఎల్లప్పుడూ ప్రజలు సహకరించి, గ్రామాన్ని అన్ని విధాల అభివద్ధి పరచడానికి సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాలేరు శేఖర్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల వివోలు, తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న అరెస్ట్ ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం

- వెంటనే విడుదల చేయాలి
- వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్యూన్యూస్ జర్నలిస్టు తీన్మార్ మల్లన్నపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి నిర్బంధించడంపై నిజామాబాద్ వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ బుస్సాపూర్ శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులతో అరెస్టు చేసి జర్నలిస్టుల గొంతు నొక్కాలని చూడడం సరైనది కాదని అన్నారు. జర్నలిస్ట్ కుటుంబాలు భయంభ్రాంతులకు గురయ్యేలా దాడులకు దిగడం సరైంద కాదని మండిపడ్డారు.ం తీన్మార్ మల్లన్న పై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన భర్తను రాత్రి అరెస్ట్ చేసి ఇప్పటివరకు ఆచూకీ తెలపడం లేదని ఆవేదన చెందుతున్న తీన్మార్ మల్లన్న భార్య తెలంగాణ ఆడబిడ్డ కాదా.?అని ప్రశ్నించారు.కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షులు అంకార్ గణేష్ , నగర పార్టీ ప్రధాన కార్యదర్శి కుంచెపు ఆనంద్, నగర బీసీ విభాగం అధ్యక్షులు కారంపూరి రవి కుమార్ , నగర యువజన విభాగం అధ్యక్షులు సంతోష్ , సాగర్ , సాయి రాం, బగ్గిలి కృష్ణ, మహిళ నాయకులు రేఖ , రాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుస్సాపూర్ శంకర్

భయం అనే ఆలోచననే భయపెట్టాలి

- తెడ్డు పోశెట్టి

నవంతెలంగాణ-నవీపేట్

భయం అనే ఆలోచననే భయపెట్టేలా భగత్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవించాలని జన వికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి అన్నారు. మండల కేంద్రంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండలంలోని పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ జర్నలిస్ట్ విష్ణువర్ధన్ హాజరై మాట్లాడుతూ విద్యార్థి నాయకులుగా తాము చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ విద్యార్థులు పరీక్షలకై బట్టి చదువులు కాకుండా అర్థవంతమైన చదువులు చదివితే జీవితంలో ఉపయోగ పడతాయని అన్నారు. అలాగే ఇటువంటి గొప్ప కార్యక్రమాలు చేస్తున్న తెడ్డు పోశెట్టి ఆర్థిక ధనవంతుడు కాకపోయిన భావజాలం ఉన్న ధనవంతుడిగా కొనియాడారు. విద్యార్థి దశలో పడ్డ కష్టాలు, నేపథ్యం కారణంగానే విద్యార్థులకు ఇటువంటి సహకారాలు అందిస్తున్నామని త్యాగాల చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం పాఠ్యపుస్తకాలలో పొందుపరిచేందుకు కృషి చేయాలని జన వికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి అన్నారు. అనంతరం సుమారు 500 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నర్సింగ్ రావు, అబ్బన్న, లోకం నర్సయ్య, సూరిబాబు, సాయి కుమార్ గౌడ్, ముస్తాక్, తెడ్డు సంధ్య, హరినంసింగ్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష అట్టలు పంపిణీచేస్తున్న తెడ్డుపోశెట్టి